క్లుప్తంగా

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి



ఇటిక్యాల మోడల్ స్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): వేసవి సెలవుల్లో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇటిక్యాల, జగదేవ్‌పూర్ గ్రామాల్లోని మోడల్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సెలవుల్లో పిల్లలకు భవిష్యత్‌కు ఉపయోగపడే అంశాల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. సెల్‌ఫోన్లు, చెడు అలవాట్లకు బానిసగా మారకుండా ఓ కంట కనిపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎంలు మాధవరెడ్డి, సైదులు, సీఆర్పీ దయానంద్ పాల్గొన్నారు.

మరకత లింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకట్ దంపతులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని కాశీ మరకత లింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహ పూజ, హోమం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ శివుని కృపతో హుస్నాబాద్ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కోఆప్షన్ సభ్యుడు శంకర్ రెడ్డి, సిద్ధేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మర్యాల రాజిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



అలిరాజ్‌పేటలో మాట్లాడుతున్న ఎంపీడీఓ యాదగిరి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ యాదగిరి అన్నారు. మంగళవారం మండలంలోని తిగుల్, అలిరాజ్‌పేట, నిర్మల్‌నగర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచాలని ఎఫ్‌ఏలకు సూచించారు. అలాగే కూలీలు ఉదయం, సాయంత్రం మాత్రమే పనులు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ నుంచి కూలీలకు రూ.300 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌వర్మ, ఎఫ్‌ఏలు పార్వతి, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



మాట్లాడుతున్న హైస్కూల్ హెచ్‌ఎం బండారి మనీల

హుస్నాబాద్: హుస్నాబాద్ కేబీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి పోతారం (ఎస్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బండారి మనీల హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని, విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు గోవర్ధన్, మోహన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పట్టభద్రులు

- గ్రామాల్లో ముమ్మరంగా ఈజీఎస్ పనులు
- 29 గ్రామాల్లో పనులు చేస్తున్న 3500 మంది కూలీలు
- చెరువుల్లో పూడికతీత, పొలాలకు తరలింపు
- పనులు చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఉన్నత విద్యావంతులు



ఉపాధి పనులు చేస్తున్న పట్టభద్రులు

గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించి వలసలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. స్థానికంగా ఉపాధి దొరుకుతుండటంతో పేద కూలీలు ఈ పనులు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా పనుల డబ్బులు వెంటనే జమవుతుండటంతో ఇప్పుడు ఉన్నత చదువులు చదివిన వారు కూడా ఉపాధి పనులు చేసేందుకు తరలివస్తున్నారు. ఇలా ఉపాధి పనులు చేస్తూ యువకులు తమ కుటుంబాలకు అసరాగా నిలుస్తున్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలోని 29 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతీరోజు సుమారు 3200 నుంచి 3500 వరకు కూలీలు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో చెరువు పూడికతీత పనులు జరుగుతున్నాయి. ట్రాక్టర్ల ద్వారా మట్టిని పొలాలకు తరలిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో డిగ్రీ, బీ ఫార్మసీ చేసిన వారు వేసవిలో ఖాళీగా ఉండకుండా ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఇలా మండల వ్యాప్తంగా సుమారు వంద మంది ఉన్నారు. ఉదయం 7 గంటలకే పనులు పూర్తి చేసి 11 గంటల లోపు ఇంటికి చెరుకుంటున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఉపాధి కూలీలు ఉదయం, సాయంత్రం చేస్తున్నారు. అధికారులు కూడా ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన పనుల జాబితా మేరకు ఉపాధి కల్పిస్తున్నారు. యువకులు ఉత్సాహంగా పనులు చేస్తున్నారు.

అమ్మానాన్నకు సాయంగా



అమ్మనాన్నలతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్తున్నా. పనుల్లో సాయం చేస్తున్నారు. వారితో పని చేయడం ఆనందంగా ఉంది. గ్రామంలో సుమారు పది మంది డిగ్రీ పూర్తి చేసిన వాళ్లం ఉన్నాం. మేమంతా ఉపాధి పనులు చేస్తున్నాం.

– మహేష్, డిగ్రీ, అనంతసాగర్

బీఫార్మసీ చేశాను



పెద్ద చదువులు చదివి కరువు పనులకు పోవడం చిన్నతనంగా భావించేవాడిని. ఇప్పుడు ఖాళీగా ఉండకుండా ఉపాధి పనులకు పోతున్నా. ఓ పనులు చేస్తూనే మరోపక్క ఉద్యోగాల కోసం ప్రిఫేర్ అవుతున్నాను.

– దయాకర్, అనంతసాగర్

ఘనంగా శకటోత్సవం

- ఎడ్ల బండ్లు, వాహనాలపై భారీగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక ఆకర్షణగా మేకల బండ్లు



మేకల బండితో ఆలయ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఐలయ్య

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో ముఖ్య ఘట్టాల్లో ఒకటైన శకటోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆయా గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చిన ఎడ్లబండ్లు, ద్విచక్ర, భారీ వాహనాలతో వచ్చి గుట్టచుట్టూ ప్రదక్షిణ చేశారు. లక్ష్మీనర్సింహస్వామి, గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. రైతులు ఎడ్లబండ్లను గుట్టచుట్టూ తిప్పి వారు పండించిన పంటలు, బియ్యం స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఉత్సవాలలో మేకలు, గుర్రాల బండ్లు ఆకర్షణగా నిలిచాయి. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్, బెజ్జంకి, సిద్దిపేట రూరల్, చిన్నకోడూర్, రాజగోపాలపేట్ ఎస్‌ఐలు కృష్ణారెడ్డి, అపూర్వరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలకృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ పీవీ శర్మ, పూజారి మధుసూదనాచారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి భారీ విరాళం



ఆలయ నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న వంశీధర్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని కుషాల్ నగర్‌లో నిర్మించిన శ్రీ కార్యసిద్ధి బాలాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కల్వకుంట్ల వంశీధర్‌రావు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. మంగళవారం స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు కాసం రవికుమార్, మల్యాలబాలరాజు, శ్రీ కార్యసిద్ధి బాలాంజనేయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

- రోటరీ ఎలెక్ట్ గవర్నర్ ఉదయ్‌పిలానీ



విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ములుగు(గజ్వేల్): దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని రోటరీ ఎలెక్ట్ గవర్నర్ ఉదయ్‌పిలానీ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ సహకారంతో, గజ్వేల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ములుగు, వర్గల్ మండలాలలకు చెందిన 350 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు, ఆటలతోపాటు కళారంగాలలో రాణించాలన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. భానుమూర్తి ట్రస్ట్ చైర్మన్ బొమ్మిడాల రాజు మాట్లాడుతూ తమ ట్రస్ట్‌తోపాటు రోటరీ ఇంటర్నేషనల్ సహకారంతో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాబుగౌడ్, క్లబ్ ప్రతినిధులు రమేష్ వంగాల, రామ్‌ప్రసాద్, రంజిత్‌సింగ్, విష్ణుజగతి, నరసింహారెడ్డి, డాక్టర్ పురుషోత్తం, అంజిరెడ్డి, నరేష్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, బాపురెడ్డి, చంటి, జగదీశ్వర్, సాయిరెడి పాల్గొన్నారు.

బ్రిడ్జి వద్ద కూరుకుపోయిన లారీ

- తప్పిన ప్రమాదం



పాలమాకుల వద్ద బ్రిడ్జి వద్ద కూరుకుపోయిన లారీ

నంగునూరు(సిద్దిపేట): రోడ్డు పనుల జాప్యంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. హన్మకొండ రహదారిపై ఏడాది కిందట రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. మంగళవారం హుస్నాబాద్ నుంచి సిద్దిపేట వైపు అధిక లోడ్‌తో వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో బ్రిడ్జి వద్ద కూరుకుపోయింది. జేసీబీ సాయంతో గంటసేపు శ్రమించి లారీని బయటకు తీశారు. బ్రిడ్జి వద్ద మట్టి, కంకర తొలగించకపోవడంతో భారీ వాహనాలు అందులో కూరుకుపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అమ్మదయతో ఆరోగ్యంగా ఉండాలి



అంక్షాపూర్‌లో బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

నంగునూరు(సిద్దిపేట): అమ్మవార్ల దయతో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు బాగా పండాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం జేపీతండాలో నూతనంగా నిర్మించిన దుర్గామాత సహిత హన్‌మాన్ దేవాలయం, రాంపూర్‌లోని రామాలయం, అంక్షాపూర్, గట్లమల్యాలలో ఎల్లమ్మ దేవాలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అంక్షాపూర్‌లో ఎమ్మెల్యేకు బోనాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, భిక్షపతి నాయక్ పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి



ఆంజనేయ స్వామి దేవాలయిలో పూర్ణహుతిలో పాల్గొన్న ఆలయ ఉద్యోగులు



చెర్వాపూర్ హన్‌మాన్ ఆలయంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్



హుస్నాబాద్‌లోని పాటిమీద హనుమాన్ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు



బెజ్జంకిలో బైక్‌ర్యాలీ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా హోమం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్ ఆలయ ఉద్యోగులు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: హన్‌మాన్ జయంతి సందర్భంగా మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెర్వాపూర్ హన్‌మాన్ ఆలయంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ స్వామివారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ మూర్తి సంధ్యారాణి, బీఆర్‌ఎస్ నాయకులు కనకయ్య, స్వామి, మనోహర్, బాలకిషన్, భాను తదితరులున్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని పాటిమీద హనుమాన్ దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతిని వైభవంగా నిర్వహించారు. హనుమాన్ భక్తులు హనుమాన్ చాలీసా పఠించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ప్రధాన కార్యదర్శి కైలాసం, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, వల్లపు రాజు, సరోజన తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం బెజ్జంకిలో హనుమాన్ భక్త మండలి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ బెజ్జంకి ప్రధాన రహదారుల గుండా లక్ష్మీనర్సింహస్వామి గుట్ట వరకు కొనసాగింది. ర్యాలీలో జై హనుమాన్, జై శ్రీరామ్ నినాదాలు చేశారు. ర్యాలీలో హనుమాన్ భక్త మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట, నారాయణరావుపేట, చిన్నకోడూరు మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఇతర పార్టీల నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కలీమొద్దీన్, అత్తు ఇమామ్, మార్కసతీష్, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు వద్దు



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణారెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పోతారం శివారులోగల ఇథనాల్ ఫ్యాక్టరీ స్థలంలో భూసార పరీక్షలు చేపట్టొద్దంటు పలువురు శివారు భూముల రైతులు మంగళవారం ఫ్యాక్టరీ స్థలానికి చేరుకున్నారు. గతంలో కంపనీ డైరెక్టర్ ఇచ్చిన హామీమేరకు మరో ప్రాంతంలో నిర్వహిస్తున్న ఫ్యాక్టరీని సందర్శించిన తరువాత రైతులకు అభ్యంతరాలు లేకుంటేనే నిర్మిస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలన్నారు. ఈ ప్రాంత రైతుల ఆమోదం లేకుండానే భూసార పరీక్షలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. విషయం తెలుసుకొని అక్కడకు సిబ్బందితో చేరుకున్న ఎస్‌ఐ కృష్ణారెడ్డి రైతులను సముదాయించారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు మాత్రమే పనులు జరుగుతాయని ఆందోళన చెందొద్దన్నారు. భూసార పరీక్షలు కంపెనీ నిర్వహణకు అనుకూలంగా ఉంటేనే పనులు చేస్తారన్నారు. దీంతో రైతులు వెనుదిరిగి వెళ్లారు.

400 పే చర్చా కార్యక్రమం

మిరుదొడ్డి(దుబ్బాక): భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మిరుదొడ్డిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు లింగాల సదానందరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నూతన ఓటర్లతో 400 పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రావాలని కోరుతూ నూతన ఓటర్లు సైతం మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావుకే మొదటి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ తీర్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు, బీజేవైఎం జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పెద్ద కురుమ కరుణాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మదన దుర్గమ్మకు ముడుపు

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలవాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లోని మదన దుర్గమ్మకు పీవీఆర్ వ్యక్తిగత వ్యవహారాల ఇన్‌చార్జి సుధాకర్‌రెడ్డి, సోదరుడు రాంరెడ్డి పూజలు చేసి ముడుపు కట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలవాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రావు, అనిల్ మొగిలి పాల్గొన్నారు.

◆ గౌరారం వద్ద వాహన తనిఖీలు

వర్గల్(గజ్వేల్): మండలంలోని గౌరారం స్టేజి వద్ద పాములపర్తి టీజంక్షన్ రోడ్డులో సోమవారం రాత్రి గౌరారం ఎస్‌ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లికి చెందిన బొంతుగుల రాజు తన వాహనంలో రూ. 50,870, అదేవిధంగా కొత్తపల్లికి చెందిన ఇంకోల్ల అశోక్ తన వాహనంలో రూ. 1,68,230 తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. వాటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ కోహెడకు రాజ్యాంగ పరిరక్షణ చైతన్య ర్యాలీ

కోహెడ(హుస్నాబాద్): రాజ్యాంగ పరిరక్షణ చైతన్య ర్యాలీ మంగళవారం కోహెడకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ హుస్నాబాద్ నియోజక వర్గం కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పిన నరేంద్ర మోదీ కనీసం పంటలకు మద్దతు ధర కల్పించటంలో విఫలమయ్యారన్నా రు. దేశ సంపదను దోచుకుంటున్న బీజేపీని గద్దె దించేందుకు ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు.

◆ కూలీలకు వసతులు కల్పించాలి

హుస్నాబాద్‌రూరల్: ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలకు పనిప్రదేశంలో వసతులు కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు చెంచల ఎల్లయ్య అన్నారు. మంగళవారం పోతారం (ఎస్)లో కూలీలు పనులు చేసే ప్రదేశాలకు వెళ్లి వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, తాగునీరు అందజేయాలన్నారు.

◆ ఉపాధి పనుల్లో వయో వృద్ధులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఒంట్లో సత్తువ తగ్గిన తర్వాత మనుమళ్లు, మనుమరాళ్లతో గడుపాల్సిన వృద్ధులు ఉపాధి హామీ పనులకు వెళ్తూ ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. పనుల్లో తమకు సాధ్యమైన పనులు చేస్తున్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బాలమల్లు, కమలమ్మ చెరువులో పూడికతీత పనులు జరుగుతున్నాయి. వీరు మాత్రం చెరువు కట్టపై ఉన్న ముళ్ల పొదలు తొలగించే పని చేస్తున్నారు.

◆ బీజేపీ మండల అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా వర్గల్ మండల అధ్యక్షుడిగా టేకులపల్లి బాల్‌రెడ్డిని నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం నుంచి అమలులోకి వస్తుందని మోహన్ రెడ్డి తెలిపారు.

◆ నియామక పత్రం అందజేత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా గరిపల్లి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో సిద్దిపేట ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అందజేశారు.

సిద్దిపేటకమాన్: ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కరీంనగర్ రోడ్డు మార్కెట్ వద్ద కొర్తివాడ శ్రీనివాస్ తన షాపులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచాడనే విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టూటౌన్ పోలీసులు సోదాలు చేపట్టారు. పది క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వచేసినట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ రథం అలంకరణకు విరాళం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామిని ఊరేగించే రథం అలంకరణకు మండల కేంద్రానికి చెందిన పుర్మ లచ్చిరెడ్డి మంగళవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సునీత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీ మండల అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండల బీజేపీ అధ్యక్షుడిగా టేకులపల్లి బాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విజయానికి, పార్టీ పటిష్టతకు తన శక్తి మేర కృషి చేస్తానన్నారు.